# చేపల మార్కెట్‌లో పడకేసిన పారిశుధ్యం

- మురుగు కాలువల్లోనే చేపల వ్యర్థాలు
- దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న కూరగాయల వ్యాపారులు



మార్కెట్‌లో చేపల వ్యర్థాలు, చెత్తాచెదారంతో పేరుకుపోయిన మురుగు కాలువ

కోరుట్ల, జూన్ 22: కోరుట్ల పట్టణంలోని గోదాం రోడ్డులో గల చేపల మార్కెట్ కంపు కొడుతున్నది. మురుగు కాలువల్లోనే చేపల వ్యర్థాలు పడేయడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. మురుగు కాలువకు రెండు వైపులా మట్టి కూరుకుపోవడంతో నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారాయి. చేపల మార్కెట్ పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించడంతో పాటు చేపల వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని కూరగాయల వ్యాపారులు కోరుతున్నారు.

# నందగిరి జీపీలో తాగునీటి దందా

- ప్రైవేట్ వ్యక్తి వాటర్ ప్లాంట్ నిర్వహణ
- అధిక ధరకు విక్రయాలు
- గ్రామ పంచాయతీకి ఆదాయం నిల్



వాటర్ ప్లాంట్ నుంచి ట్యాంక్, డబ్బాల్లో విక్రయించేందుకు ఆటోలో తీసుకెళ్తున్న నీళ్లు

పెగడపల్లి, జూన్ 22: పెగడపల్లి మండలం నందగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు రూ.5కే 20 లీటర్ల తాగు నీరందించారు. కొద్ది రోజుల తర్వాత నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో ప్లాంట్ చెడిపోయి మూతపడింది. ఏడాది తర్వాత గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దానికి మరమ్మతులు చేయించి, తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చాడు. కాగా, నాలుగేళ్ల క్రితం సదరు వ్యక్తి వాటర్ ప్లాంట్‌ను తానే నిర్వహిస్తానని చెప్పి, ఇందుకు గానూ గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు, ఇతర పనులు చేయిస్తానని ఒప్పందం చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతీలో అప్పటి పాలక వర్గం తీర్మానం చేసి, వాటర్ ప్లాంట్ నిర్వహణను సదరు వ్యక్తికి అప్పగించింది. దీంతో ఆయన వాటర్ ప్లాంట్ నిర్వహణతో పాటు అందులోనే కూలింగ్ యంత్రం ఏర్పాటు చేసి అధిక ధరకు తాగు నీటిని విక్రయిస్తున్నాడని గ్రామస్తులు వాపోతున్నారు. సదరు వ్యక్తి గ్రామ పంచాయతీలోనే పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ, వేతనం కూడా తీసుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మధును వివరణ కోరగా, గ్రామ పంచాయతీలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిర్వహిస్తున్నది వాస్తవమే. నాలుగేళ్ల క్రితమే అప్పటి పంచాయతీ పాలక వర్గం వాటర్ ప్లాంట్ నిర్వహణపై తీర్మానం చేసిందని, అప్పటి నుంచి అలాగే నడుస్తున్నదని తెలిపారు.

# నిధులు రాక నిలిచిన అభివృద్ధి

- కోరుట్ల పట్టణంలో అధ్వానంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువలు
- టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 10 కోట్లు విడుదల చేయాలని ప్రజల వేడుకోలు



పట్టణంలోని మోచీ బజార్‌లో అధ్వానంగా మారిన రోడ్డు

కోరుట్ల, జూన్ 22: పట్టణంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి నిధుల విడుదలపై నీలినీడలు కమ్ముకున్నాయి. దెబ్బతిన్న రహదారుల స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణం, చెడిపోయిన మురుగు కాలువల స్థానంలో, డ్రైనేజీలపై స్లాబ్‌ల నూతన నిర్మాణాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. పట్టణంలోని 33 వార్డుల్లో పనులు చేపట్టేందుకు అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో నిధుల మంజూరుకు ఆటంకం ఏర్పడింది. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాసనసభ సమావేశాల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు చేయాలని సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు మంత్రులకు సైతం ఎమ్మెల్యే వినతి పత్రాలు సమర్పించి నిధుల మంజూరుకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పందన లేక పనులు నిలిచిపోయాయి. నిధుల మంజూరులో జాప్యంతో పట్టణంలోని పలు వార్డుల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, డ్రైనేజీల నిర్మాణాలు నిలిచిపోయాయి. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, రథాలపంపు, హాజీపురా, ఆదర్శనగర్, భీమునిదుబ్బ, అయ్యప్పగుట్ట, బీసీ కాలనీ, ఎస్కోనిగుట్ట, మాదాపూర్ కాలనీల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో మట్టి రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

### వార్డుల వారీగా కేటాయించిన నిధులు

పట్టణంలో మొత్తం 33 వార్డులు ఉండగా ఆయా వార్డుల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు నిధులను వార్డుల వారీగా కేటాయిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 1, 10, 21, 28వ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం రూ. 40 లక్షల చొప్పున, 3, 23వ వార్డుకు రూ. 35 లక్షలు, 2, 4, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 18, 20, 25, 27, 28, 29, 30, 32, 33వ వార్డులకు రూ. 30 లక్షలు, 13వ వార్డుకు రూ.25 లక్షలు, 11, 12, 19, 22, 24, 31వ వార్డులకు రూ. 20 లక్షలు, గాయత్రి బ్యాంక్ నుంచి కటుకం సంగయ్య కల్యాణ మండపం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 25 లక్షల చొప్పున మొత్తం రూ.10 కోట్లు కేటాయించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఇరు వర్గాల ఘర్షణ

మెట్‌పల్లి, జూన్ 22: పట్టణంలో ఇరు వర్గాలు గొడవ పడగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మఠం వాడలో ఆదివారం పెద్దమ్మ జాతర జరుగుతుండగా, జక్కం రమేశ్, జక్కం పెద్దరాజం, జక్కం నడిపి రాజం, జక్కం పవన్, జక్కం శేఖర్, జక్కం రాము వర్గానికి యామ రాజయ్య, యామ రంజిత్, యామ ప్రకాశ్, యామ మారుతి, యామ గంగాధర్ వర్గంతో గొడవ జరిగింది. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇరు వర్గాలు ఠాణా ముందు కూడా గొడవపడినట్లు పేర్కొన్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# యూరియా కొరత లేకుండా చూడాలి

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వినతి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జూన్ 22: రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నారని, సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగి ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ మేరకు మంత్రులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని, ఎరువులు విత్తనాలకు ఇబ్బంది లేకుండా చూశామని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 'మన ఊరు–మన బడి'లో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని, మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం కూలిపోయే స్థితిలో ఉందని విన్నవించారు. వెంటనే మంత్రి స్పందించి, విద్యార్థులను వేరే భవనంలోకి మార్చి తరగతులు నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించారని చెప్పారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్‌ను నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. కోరుట్లలో ఇటీవల వినాయక విగ్రహాల తయారీ కేంద్రం వద్ద విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వినోద్ భార్యకు ఏదైనా ఉద్యోగావకాశం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

## లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కోటి నవదుర్గా క్లబ్ నూతన సభ్యులు

కోరుట్ల రూరల్, జూన్ 22: పట్టణంలోని జీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గా క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల అధ్యక్షుడిగా కొమ్ముల జీవన్‌రెడ్డి, కార్యదర్శిగా ఏలేటి లక్ష్మారెడ్డి, కోశాధికారిగా నల్ల గంగాధర్, కోటి నవదుర్గా క్లబ్ అధ్యక్షురాలిగా గండ్ర రాధిక, కార్యదర్శిగా గుంటుక వందన, కోశాధికారిగా కొత్త లౌక్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గుంటుక చంద్రప్రకాశ్, సురేశ్‌బాబు, అనంతుల శివప్రసాద్, సింగిరెడ్డి వాసుదేవరెడ్డి, గాలిపెల్లి వెంకట్, ఆడెపు మధు, డాక్టర్ దిలీప్‌రావు, చాప కిశోర్, పోతని ప్రవీణ్, అల్లాడి ప్రవీణ్, ఎలిమెల్ల ఉషాకిరణ్, గండ్ర అజయేందర్‌రావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పలిగిరి'కి రాష్ట్ర జానపద కళా పురస్కారం

ధర్మపురి, జూన్ 22: ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన పలిగిరి రాజేందర్ ఆదివారం జానపద కళా పురస్కార్ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు. కాగా, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి చేతుల మీదుగా రాజేందర్ అవార్డు అందుకున్నారు.

## గ్రామస్తుల శ్రమదానం

వెల్గటూర్, జూన్ 22: ఎండపల్లి మండలం గొడిసెలపేటలోని పెద్దన్న, భీమన్న పురాతన ఆలయాన్ని పూరి గుడిసెతో నిర్మించగా, పూర్తిగా శిథిలమైంది. కాగా, గ్రామస్తులు ఆదివారం శ్రమదానం చేసి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. మాజీ సర్పంచ్ మెతుకు స్వామి రూ. 22 వేలు వెచ్చించి రేకులతో షెడ్డు నిర్మించారు.

## నేడు రైతు మిత్ర కార్యక్రమం

జగిత్యాల టౌన్, జూన్ 22: జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి సెంటర్లలో సోమవారం రైతు మిత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పంటల సాగులో సందేహాలను నివృత్తి చేసుకోవడానికి సమీపంలోని సహాయ వ్యవసాయ సంచాలకులను సంప్రదించాలని సూచించారు.

## వ్యవసాయ మోటార్లు, పైపులైన్లు ధ్వంసం

మెట్‌పల్లి రూరల్, జూన్ 22: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన బండ శ్రీనివాస్ వ్యవసాయ భూమిలోకి ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మూడు రిగ్గు మోటార్లు, పైపులైన్లు ధ్వంసం చేయడంతో పాటు 5హెచ్‌పీ మోటార్, స్టాటర్ ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని పాటిమీది తండాకు చెందిన జరుపుల రవి, గుగ్లావత్ రాము, వారి అనుచరులు ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానం ఉందని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

మెట్‌పల్లి రూరల్, జూన్ 22: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన 47 మందికి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి దవాఖానలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయించినట్లు మెట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి, శస్త్ర చికిత్సలు అవసరమైన 47 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరిని ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి దవాఖానకు తరలించి ఆదివారం శస్త్ర చికిత్సలు చేయించి, సురక్షితంగా తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రాకేశ్, వేణుగోపాల్, వెల్మల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చిగురుమామిడి, జూన్ 22: వ్యవసాయ కూలిపనుల కోసం పొరుగు రాష్ట్రం నుంచి భార్య, బంధువులతో కలిసి వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. కృష్ణా జిల్లా కోడూరు మండలం ఓటగుండం గ్రామానికి చెందిన 18 మంది మూడు రోజుల క్రితం కరీంనగర్ జిల్లా చిగురుమామిడికి వరి నాట్లు వేసేందుకు వచ్చారు. ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో తిరిగి స్వస్థలానికి పయనమయ్యారు. ఆదివారం చిగురుమామిడి నుంచి కరీంనగర్‌కు రెండు ఆటోల్లో బయలుదేరారు. ఒక్కో ఆటోలో తొమ్మిది మంది చొప్పున కూర్చున్నారు. చిగురుమామిడి గ్రామ శివారులో కరీంనగర్ నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తూ ఓ కారు ఎదురుగా రాగా, డ్రైవర్ ఆటో(ఏపీ 15 టీప 6063)ను రోడ్డు పక్కకు తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ముందు కూర్చున్న కందుల సురేశ్ (43) తలకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేశ్ మృతి చెందాడు. అదే ఆటోలో ఉన్న దావనబోయిన శ్రీరాములు, దావనబోయిన నాంచారమ్మ, దావనబోయిన కృష్ణకుమారి, మాగంటి కుమారికి తీవ్ర గాయాలయ్యాయి. వారు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

## అంబేద్కర్‌కు నివాళి

జగిత్యాల రూరల్, జూన్ 22: ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఐసీసీఐ జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్, నాయకులు అనంతుల కాంతారావు, మద్దెల నారాయణ, చిత్తారి ప్రభాకర్, నకుమల్ల నారాయణ, అశోక్ రాజ్, వెంకటేశ్, జవ్వాజి శంకర్, కంటే అంజయ్య, రమేశ్, గిద్దె శంకరయ్య, తోట జగన్, మహేశ్, కమలాకర్, గంగాధర్, లచ్చయ్య, రత్నయ్య, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అర్పపల్లిలో ఉచిత వైద్య శిబిరం



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

సారంగాపూర్, జూన్ 22: మండలంలోని అర్పల్లి గ్రామంలో ఆదివారం జగిత్యాలలోని వాణి దవాఖాన వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు మూడు వందల మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ భుక్యా గోపాల్, విజయ్‌కుమార్, వైద్యులు ప్రణయ్ రెడ్డి, స్వాతి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడికి నివాళి

మల్యాల, జూన్ 22: మండలంలోని పోతారాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొండపలుకుల దామోదర్‌రావు ఆదివారం మృతి చెందారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పోతారాం వెళ్లి దామోదర్‌రావు మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ కొండపలుకుల రాంమోహన్‌రావు, నాయకులు బద్ధం తిరుపతిరెడ్డి, ఎడిపల్లి అశోక్, నిమ్మ గణేశ్, కోటేశ్వర్‌రావు, తదితరులున్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న వాసవీ క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి, జూన్ 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వాసవీ క్లబ్ అంతర్జాతీయ ప్రతినిధులు అంచురి శ్రీనివాస్, మనోజ్ కోరారు. ఆరపేట శివాలయం ఆవరణలో ఆదివారం మెట్‌పల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డాన్ టూ డక్స్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి ఎల్మి రవి, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్, కిరణ్‌కుమార్, పవన్, సునీల్, రాజేంద్రప్రసాద్, రమేశ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

మారుతీనగర్, జూన్ 22: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర డిమాండ్ చేశారు. మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు తమ పాఠశాలలోనే కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు చీటీలను రాసి పంపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అనుమతి లేకుండా పాఠశాల సమీపంలోనే బుక్‌స్టాళ్లను ఏర్పాటు చేసి పుస్తకాలను విక్రయిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు, ఫీజుల వసూళ్ల తీరును పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘ నాయకులు దినేశ్, గౌతంకుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.

## సంఘాలు-కార్యవర్గం



జగిత్యాల: ఎన్నికైన రజక సంఘం సభ్యులు

జగిత్యాల, జూన్ 22: జిల్లా కేంద్రంలో ఆదివారం రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా గుండారపు రవీందర్, ఉపాధ్యక్షుడిగా మరిపెల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా సట్ట శ్రీనివాస్, కోశాధికారిగా మతులపురం మహేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియం, జగిత్యాల డైలీ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేరెళ్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి గా మెరుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తోడేటి లచ్చయ్య, సహాయ కార్యదర్శిగా ఏవీ మహేందర్ రావు, కోశాధికారిగా ఆనంతుల విఠలయ్య, డైరెక్టర్లుగా తొగిటి శ్రీనివాస్, బుర్ర చంద్రశేఖర్, చికోటి శ్రీనివాస్, చోటపెల్లి నారాయణ, జోగ మల్లేశం, శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు నాగభూషణం, నాగేంద్రం, మల్లికార్జున్, శ్రీనివాస్ ప్రకటించారు.

మేడిపల్లి, జూన్ 22: ఎమ్మార్పీఎస్ మేడిపల్లి మండలాధ్యక్షుడిగా దొనిపాల శంకర్, భీమారం మండలాధ్యక్షుడిగా చిలివేరి వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్, కార్యదర్శి సంగెపు ముత్తు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు బంగారు దీపక్, నాయకులు దేవదాస్, రమేశ్, ఆనంద్, రాకేశ్, శాంతయ్య, రవి, లవ్‌కుమార్, సురేశ్, అజయ్, అనిల్, తిరుపతి, ప్రసాద్, శేఖర్, మధు, లక్ష్మణ్, మిథినేష్, జలంధర్, సోను పాల్గొన్నారు.

కథలాపూర్, జూన్ 22: లయన్స్‌క్లబ్ కథలాపూర్ అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా జవిడి ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా పిడుగు ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా రెండో గవర్నర్ చంద్రప్రకాశ్, సలహాదారులు శివప్రసాద్, సురేశ్, మండల ప్రతినిధులు నాగం భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పూంద్ర జనార్దన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదు



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి

జగిత్యాల టౌన్, జూన్ 22: జిల్లా కేంద్రంలోని బాలికల హైస్కూల్ ఆవరణలో ఆదివారం డీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్జీటీలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం సరికాదన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఉత్తర్వులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దాశెట్టి రవీందర్‌రెడ్డి, ఇంద్రాల రామేశ్వర్, కార్యదర్శులు నీలం సంపత్, మొగిలి గంగరాజు, గట్ల సంతోష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం

మేడిపల్లి, జూన్ 22: మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చంద గంగరాజం అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. 'ఓ' నెగిటీవ్ రక్తం అవసరం కాగా, కుటుంబసభ్యులు సామాజిక సేవకుడు చెక్కపెల్లి రఘును సంప్రదించారు. చెక్కపెల్లి రఘు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పొన్నం శ్రవణ్ సోషల్ మీడియాలో చూసి స్పందించి దవాఖానకు వెళ్లి రక్తదానం చేశాడు. పొన్నం శ్రవణ్‌ను డాక్టర్లు, గంగరాజం కుటుంబసభ్యులు, మిత్రులు అభినందించారు.

## అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం

మేడిపల్లి, జూన్ 22 : భీమారం మండల కేంద్రానికి చెందిన ద్యావనపల్లి సరయు దంపతులు ఇటీవల మృతి చెందారు. వారి పిల్లలు అనాథలయ్యారు. పెద్ద కూతురు జీవన 2016–17 పదో తరగతి బ్యాచ్ మిత్రులు రూ. 49611 ఆదివారం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఉత్కం మహేశ్, తొట్ల మాధవన్, అగుర్ల రాకేశ్, చెట్టి మణి, నగేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలందిస్తాం



రైతుకు బహుమతి అందజేస్తున్న సింగిల్ విండో చైర్మన్ వేణుగోపాల్

పెగడపల్లి, జూన్ 22: నంచర్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో ఆదివారం ఇండియన్ ఆయిల్ కంపెనీ న్యూ ఇయర్ ధమాకా 2025 స్కీమ్‌లో భాగంగా లక్కీడ్రాలో గెలుపొందిన రైతులకు ఆయన కార్యదర్శి రౌతు మధుకర్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మంత్రి వేణుగోపాల్ మాట్లాడుతూ, సంఘం పరిధిలోని రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వారికి ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తిరుపతి, సత్తిరెడ్డి, రాజయ్య, రమేశ్, మధు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గానికి సత్కారం



నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానిస్తున్న ఈద్గా కమిటీ అధ్యక్షుడు

కోరుట్ల రూరల్, జూన్ 22: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో అల్లమయ్యగుట్ట వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి కోరుట్ల ఈద్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అస్రార్ ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు, ఈద్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కోరుట్లలో ఇద్దరు యువకులపై దాడి

కోరుట్ల రూరల్, జూన్ 22: పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఇద్దరు యువకులపై దాడి జరిగింది. ఎస్ఐ రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని గంగంపేట కాలనీకి చెందిన బన్నీ, హైమద్ కొత్తబస్టాండ్ సమీపం నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో పరిచయం ఉన్న మాదాపూర్ కాలనీకి చెందిన షాదాబు, లడ్డు ఎదురుపడి అకారణంగా గొడవ పడ్డారు. ఈ క్రమంలో తమ వద్ద ఉన్న గొలుసు, చేతి కడియంతో హైమద్, బన్నీపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో యోగేశ్వరి

కొత్తపల్లి, జూన్ 22: బీహార్ రాష్ట్రంలోని నవాడలో ఈ నెల 18నుంచి 22వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారిణి ఎం యోగేశ్వరి పాల్గొన్నదని ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన జూనియర్స్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న యోగేశ్వరి ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. యోగేశ్వరిని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్, డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

# నారుమడిలో సస్య 'రక్షణ'

- మేలైన విత్తనాల ఎంపికే కీలకం
- జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన

ఇబ్రహీంపట్నం, జూన్ 22: వానకాలం ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు దున్ని, విత్తనాలు విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే మడుల్లో నారు పోశారు. కొన్నిచోట్ల తూకం పోసి నాటేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు తమ సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరిలో సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. నారు పోసే రైతులు మేలు రకం విత్తనాలు ఎంచుకోవాలని, లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అందుకు సంబంధించిన రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### విత్తన శుద్ధే కీలకం

వరి సాగులో ముఖ్యంగా విత్తన శుద్ధే కీలకం. ఎకరానికి దొడ్డురకం అయితే 25 కిలోలు, సన్నరకం 20 కిలోలు ఎంపిక చేసుకోవాలి. హైబ్రిడ్ రకం 10 కిలోల విత్తనాలు సరిపోతాయి. దమ్ము చేసిన నారు మళ్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి తర్వాత మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలకు లీటరు ద్రావణం సరిపోతుంది.

### జాగ్రత్తలు పాటించాలి

నారు పోసే సమయంలో నారుమడి బాగా దున్ని రెండు, మూడు సార్లు చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి కాలువలను ఏర్పాటు చేసి ఎత్తు నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12 నుంచి 14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్ దుక్కిలో వేయాలి. పశువుల పేడ, సేంద్రియ ఎరువులను దుక్కిలో వేస్తే ఇంకా మంచిది. అలాగే, మొలక కట్టిన విత్తనాన్ని చల్లి మొదట్లో (వారం రోజుల్లో) ఆరు తడులు ఇచ్చి ఆ తర్వాత మొక్క దశలో పలుచగా (రెండు, మూడు సెంటీమీటర్ల) నీరు ఉంచుకోవాలి.

### జింక్, ఇనుపదాతు లోప నివారణ చర్యలు

నారుమడిలో జింక్, ఇనుపదాతు లోపాన్ని గమనిస్తే వెంటనే సరిచేయాలి. జింక్ లోప సవరణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. అదేవిధంగా ఇనుపదాతు లోపం కోసం పంట, మొక్క వయసు, ఎదుగుదలను బట్టి రెండు నుంచి ఐదు గ్రాముల అన్నభేది 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పీకే ఏడు రోజుల ముందు గుంట నారుమడికి 2.5 సెంట్లకు 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి చల్లి పలచగా నీరందించాలి.

### కలుపు యాజమాన్య పద్ధతులు

నారుమడిలో బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్, సేఫనర్ 25 మిల్లీ లీటర్లను ఎకరానికి సరిపడా నారుమడికి 5 లీటర్ల నీటిలో కలిపి విత్తిన ఎనిమిది నుంచి 10 రోజులకు పిచికారీ చేసుకోవాలి. అలాగే, బిస్పైరిబాక్ సోడియం అనే మందును 0.5 మిల్లీ లీటర్లను లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 10 నుంచి 12 రోజుల్లో పిచికారీ చేయాలి. ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉంటే విత్తిన 15 నుంచి 20 రోజులకు సైహలోఫాప్ బీ బ్యూటైల్ అనే మందును 15 మిల్లీ లీటర్ల నీటికి చొప్పున పిచికారీ చేసుకోవాలి.

## తపాలా ఉద్యోగుల సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి

హుజూరాబాద్ టౌన్, జూన్ 22: తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్–సీ, ఎన్ఎఫ్‌పీఈల గుర్తింపును పునరుద్ధరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, శ్రవణ్ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో అత్యున్నత న్యాయ స్థానాలు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయక, ఉద్యోగ సంఘాలను అణచివేసే ధోరణితో వ్యవహరించడం శోచనీయమని పేర్కొన్నారు. కొత్త వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలని దేశ వ్యాప్తంగా రైతులు చేపట్టిన పోరాటానికి తపాలా ఉద్యోగుల సంఘం ఏఐపీఈయూ–గ్రూప్ సీ మద్దతు ఇచ్చిందన్న కల్పిత, నిరాధార ఆరోపణలతో కూడిన ఫిర్యాదుపై కేంద్రం స్పందించి గుర్తింపును రద్దు చేసిందని తెలిపారు. దీనివల్ల తపాలా ఉద్యోగ సంఘానికి అధికారులతో ఉన్న సంప్రదింపుల హక్కులకు విఘాతం కలిగిందన్నారు.